ఘనంగా దసరా వేడుకలు

దగ్ధమవుతున్న మహిషాసురుని ఉత్సవ విగ్రహం

- జిల్లాలో శమీ పూజలు..
- మహిసాసురమర్ధిని కార్యక్రమాలు
- దుర్గాదేవీ విగ్రహాల నిమజ్జనం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 24: జిల్లాలో దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి పల్లకీసేవ జంబిగద్దెపై జమ్మి చుట్టూ ప్రదక్షిణలు చేయగా ఆర్డీవో నర్సింహమూర్తి దంపతులు శమీపూజ నిర్వహించారు. జమ్మి కొమ్మలను కత్తిరించి జమ్మికొట్టుడు కార్యక్రమాన్ని ముగించారు. పూజ అనంతరం భక్తుల మధ్య తోపులాటలు జరుగకుండా డీఎస్పీ వెంకటస్వామి, టౌన్ సీఐ నటేశ్, రూరల్ సీఐ ఆరిఫ్ బందోబస్తు చేపట్టారు. అనంతరం నవ దుర్గా, కనకదుర్గా, సువర్ణదుర్గా సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో జంబిగద్దె వద్ద మహిషాసురమర్ధిని కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య దుర్గామాత చేతి నుంచి వదిలిన బాణం నిప్పులు చిమ్ముతూ భారీగా తయారు చేసిన మహిషాసురుడి ఉత్సవ విగ్రహం దహనమైంది. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయుధ పూజ

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 24: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దుర్గాదేవికి ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మ్‌డ్ ఫోర్స్ విభాగంలో ఎస్పీ ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించి పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పూజా కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీమ్‌రావు, డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రకుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ నటేశ్, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు జానీమియా, రామకృష్ణ, వేణు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్: ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జంబి చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న ఆర్డీవో నర్సింహమూర్తి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

సాయిబాబా పుణ్యతిథి వేడుకలకు హాజరు.. పూజలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 24: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సాయి పుణ్యతిథిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని కృష్ణానగర్ సాయిబాబా ఆలయం, శ్రీ గుట్ట రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని సాయిబాబా విగ్రహాలకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు అల్లె గంగాసాగర్ ప్రేమలత, సత్యం, బాలె లత-శంకర్, గుట్ట రాజేశ్వరస్వామి పూజారి జగదీశ్వర్, నాయకులు నాగుల కిషన్‌గౌడ్, మానాల కిషన్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ

జగిత్యాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు, 28వార్డు కౌన్సిలర్ పద్మావతి భర్త మేక పవన్ ప్రమాదవశాత్తు గాయపడగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ పంబాల రామ్‌కుమార్, నాయకులు డిష్ జగన్, ప్యాక్స్ చైర్మన్ సాగర్ రావు, తదితరులున్నారు. జగిత్యాల పట్టణం సుతారిపేటకు చెందిన రిటైర్డ్ వెటర్నరీ డాక్టర్ ఎంఏ రావుఫ్ మరణించగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కో ఆప్షన్ సభ్యులు రియాజ్ మామ, అమీన్ ఉల్ హసన్, ప్యాక్స్ చైర్మన్ సాగర్ రావు, మహమ్మద్ ఖాన్, మొయిన్, జమీల్, శాజి ఫిరోజ్, అస్ఫర్ ఖాన్, మిసాక్ అహ్మద్, మైనార్టీ నాయకులు తదితరులున్నారు.

ఆలయానికి మినీ వాటర్ ఫ్రిజ్ అందజేత

ఫ్రిజ్‌ను అందిస్తున్న దాత

సారంగాపూర్, అక్టోబర్ 24: పెంబట్ల శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మద్దుట్ల గ్రామానికి చెందిన పాలకుర్తి గిరిధర్ అనే భక్తుడు ఆలయానికి మినీ వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మినీ వాటర్ ఫ్రిజ్‌ను అందజేయగా, భక్తుడిని ఆలయ అధికారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్లు రజినీకాంత్, రవి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, అక్టోబర్ 24 : జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి కండ్లె మల్లయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్లయ్య ఆధ్వర్యంలో బొమ్మెన రవి, సుతారి పవన్, 30 మంది యువకులు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరగా, పార్టీ కార్యాలయంలో డాక్టర్ సంజయ్ కుమార్ నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దావ సురేశ్, సర్పంచ్ బుర్ర ప్రవీణ్, మాజీ సర్పంచ్ ఆనంద్ రావు, నాయకులు శేఖర్, రామ్‌కిషన్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ ఆవిర్భావ వేడుకలు

మారుతీనగర్, అక్టోబర్ 24: మెట్‌పల్లి ప్రజల సమైక్య పోరాట ఫలితమే రెవెన్యూ డివిజన్ ఆవిర్భావం సాధ్యమైందని సాధన కమిటీ అధ్యక్షుడు తోకల సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ పార్కులో మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ ఆవిర్భావమై 8వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లు పంచిపెట్టి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ సభ్యులు నాంపెల్లి గట్టయ్య, గుంటుక గంగాధర్, తోగిటి అంజయ్య, గురిజెల రాజారెడ్డి, గుంటుక సదాశివ్, పుల్ల రాజాగౌడ్, దేవలింగం, నారాయణ, చంద్రశేఖర్, నాగరాజు, జగన్, పుల్ల జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

యువతి ఆత్మహత్య

జగిత్యాల రూరల్, అక్టోబర్ 24: అదనపు కట్నం వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ గ్రామానికికు చెందిన కన్నం వెంకయ్య కూతురు సుమలతకు జగిత్యాలలోని తారకరామనగర్‌లో నివాసముంటున్న కట్ట సంజీవ్‌తో వివాహం జరిగింది. అయితే తన కూతురిని కొన్ని రోజులుగా తన అల్లుడు సంజీవ్ వేధిస్తున్నాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఫోన్ చేసి సుమలత ఆత్మహత్య చేసుకుందని చెప్పాడన్నారు. తన కూతురు ఆత్మహత్య చేసుకోలేదని, సంజీవే హత్య చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ వెంకయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అయాజ్ ఖాన్ పేర్కొన్నారు.

సంజయ్ కుమార్‌ను గెలిపించండి

కారు గుర్తుకు ఓటు వేసి సంజయ్‌ను గెలిపించాలని కోరుతున్న నాయకులు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 24: పట్టణంలో మంగళవారం జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్‌కు మద్దతుగా జగిత్యాల ఎంఐఎం అధ్యక్షుడు యూనస్ నదీం, కౌన్సిలర్ రజీయొద్దీన్ తదితరులు ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదని, ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇలియాస్, జహూర్ ఖాన్ పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఐఏఎస్‌ల సందడి

మారుతీనగర్, అక్టోబర్ 24: దసరా వేడుకల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన దురిశెట్టి అనుదీప్ హైదరాబాద్ కలెక్టర్, సింగరేణి సీఎండీ నడిమెట్ల శ్రీధర్ ఇరువురు ఐఏఎస్‌లు కుటుంబ సమేతంగా సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, పలువురు బాల్యమిత్రులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

మెట్‌పల్లి స్వగ్రామంలో దురిశెట్టి అనుదీప్ ఇంట్లో సింగరేణి సీఎండీ శ్రీధర్

సవరణలతో వయోవృద్ధులకు భరోసా

జగిత్యాల టౌన్, అక్టోబర్ 24: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సీనియర్ సిటిజన్స్ రక్షణ చట్టంలో చేసిన పలు సవరణలు వయోవృద్ధులకు భరోసా కలిగించాయని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో దసరా సమ్మేళనం నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు వివిధ యువజన మహిళా సంఘాల ప్రతినిధులకు వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. టాస్కా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సదస్సులో గౌరిశెట్టి విశ్వనాథం, బొల్లం విజయ్, పీసీ హన్మంత్‌రెడ్డి, ఎండీ యాకుబ్, బొబ్బాటి కరుణ, వెల్మల ప్రకాశ్‌రావు, పూసాల అశోక్‌రావు, కొయ్యడ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆటో స్టోర్ దహనం

పెగడపల్లి, అక్టోబర్ 24: పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తోడేటి అనిల్‌కు చెందిన మెకానిక్ షాప్, ఆటో స్టోర్ దగ్ధం అయ్యింది. బాధితుడు అపిల్ తెలిపిన వివరాల ప్రకారం. సోమవారం విజయదశమి సందర్భంగా దుకాణంలో పూజ చేసి, షాప్‌ను బందు చేసి ఇంటికి వచ్చానని తెలిపాడు. రాత్రి సమయంలో షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఆటో స్టోర్ స్పేర్ పార్ట్స్ కాలిపోయి రూ.1లక్ష వరకు నష్టం సంభవించినట్లు తెలిపాడు. గ్రామ సర్పంచ్ గుర్రం అనూష-మల్లారెడ్డి ఘటనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆటో స్టోర్‌లో దహనమైన సామగ్రి